523059101

కానుపించెడి జగతిలో కానరాక
అందు వెలుగొందు చైతన్య మాత్మరూపు
మణులయందున సూత్రంబు మాదిరిగను
విశ్వమంతయు నిండెను విశ్వవిభుడు.

ప్రేమస్వరూపులారా!

సర్వం ఖల్విదమ్ బ్రహ్మ. ఇది సమస్త ఉపనిషత్తుల సారము. చరాచర ప్రపంచ మంతయు యీ చిన్ని పదమునందే యిమిడి వుంటున్నది. బ్రహ్మము కానిది యీ జగత్తునందు కానరాదు.

కట్టెలందున నిప్పులు కలిగినట్లు
తిలలయందున తైలంబు వెలయునట్లు
ఎందు చూచిన దైవంబు నిండియుండె

కనుక దైవము కానిది యీ జగత్తులో కానరాదు. దైవము యొక్క శాసనము పురస్కరించుకొనియే సృష్టి స్థితి లయములు కూడను జరుగుచున్నవి. మానవుడు నమ్మినను నమ్మకపోయిననూ యీ జగత్తనే చక్రము దైవశాసనము వలననే తిరుగుచున్నది. కాలచక్రమునకు కర్త దైవమే. కానీ యీ కాలమును యేవిధముగా మానవుడు వినియోగించాలి, ఏవిధముగా యీ కాలము పవిత్రముగావించుకోవాలి అనేటువంటి సత్యాన్ని మానవుడు మరచిపోతున్నాడు. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు తన చల్లదనమును జగత్తున కందిస్తున్నాడు. వర్షములు కురియుచున్నవి. నదులు ప్రవహించుచున్నవి. పంటలు పండుచున్నవి. ఇవన్నియు ఏ ఒక్క మానవుని నిమిత్తము యేర్పడినవి కాదనే సత్యాన్ని ప్రతివ్యక్తి గుర్తించటం అత్యవసరము. ఈ ప్రకృతి యందు జన్మించిన ప్రతి మానవునికి దీనిని అనుభవించే సమానమైన అధికారము వున్నది. కాని యిట్టి సత్యాన్ని మానవుడు విస్మరించాడు. సమత్వమైన యోగమును మానవుడు యేనాడు అర్థము చేసుకొనుటకు ప్రయత్నించటము లేదు. ఈ నిర్లిప్తమైన భావము పసిపాపలయందు మాత్రమే కనుపించుచున్నది. తల్లిపాలను త్రాగి, చల్లని గాలి పీల్చి, కమ్మని కంఠము లోపాడే తల్లి జోల పాటలకు మురిసి తనయొక్క మనసును మరచి మధుర భావములో మునిగే భావము పసిపిల్లల యందు మాత్రమే కనుపించుచున్నది. కానీ మానవుడు

పెరుగుకొంది. తన పర అనే భేదములు పుట్టుచున్నవి. స్వార్థము పెరుగుచున్నది. త్యాగము తరుగుచున్నది. మానవత్వము మరుగు పడుచున్నది. కారణమేమిటి? ఆత్మ విశ్వాసమును కోల్పోవటమే. సర్వత్రా వుండిన శక్తి, సర్వేశ్వరశక్తి అనే తత్వాన్ని విస్మరించటమే. అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థిత అని తన యందు, తన వెలుపల, తన చుట్టూ, సర్వత్రా సర్వ కాలములందు కూడను వ్యాపించుచున్నటువంటి దివ్యత్వాన్ని మానవుడు అర్థము చేసుకొనుటకు తగిన ప్రయత్నము చేయుటలేదు.

జగత్తులో ధనవంతులు కలరు. బలవంతులు కలరు. గుణవంతులు కలరు. విద్యావంతులు కలరు. కాని ఆత్మవంతులు కానరావటం లేదు. ఆత్మవంతులనగా ఏమిటి? శరీరము కనుపిస్తుంది. మనస్సు వున్నట్లుగా అనిపిస్తుంది. కానరాని ఆత్మను కనుపించునట్లు చేసుకొని ఆ ఆనందములో తాను తన్మయుడై, ఉన్మత్తుడై దివ్యత్వమును అనుభవించినవాడే ఆత్మవంతుడు. ఇట్టి ఆత్మవంతులు ప్రాచీన కాలమునందు అనేకమంది మహర్షులు ఈ దివ్యమైన భావాన్ని ఈ దివ్యమైన రసమును, ఈ దివ్యమైన శక్తిని అనుభవించి ఆనందించి జగత్తునకు అందిస్తూ వచ్చారు. ప్రాకృతమైన మానవునకు ఈ పరతత్వమును బోధించే నిమిత్తమై అనేక ఉపనిషత్తులందున్న భావములను క్రోడీకరించుకొని వాటిని త్రికోణ స్వరూపకంగా జగత్తుకు చాటుతూ వచ్చారు. ఒకటి శరీరము. రెండవది మనస్సు. మూడవది ఆత్మ. శరీరము స్థూలము. ఆత్మ సూక్ష్మము. ఈ స్థూలము సూక్ష్మము అయిన శరీరమునకు ఆత్మకు సమన్వయము గావించి రెండింటిని కూర్చి చేర్చి ఆనందింప చేయునటువంటిది మనస్సు. ఈ మూడింటి సమన్వయము యొక్క ప్రతిపాదనే తత్వము అని నిరూపించారు. ఈ తత్వము యొక్క సత్యాన్ని మానవుడు సరిగా అర్థము చేసుకోటంలేదు. తత్-త్వం. తత్ అనగా అది. త్వమ్ అనగా యిది. అది అనగా మనము గుర్తించవలసినది. యేమిటి?

మనకు దూరముగానున్న దానిని THAT అంటాము. దగ్గరగానున్న దానిని THIS అంటాము. దేనికి దూరముగా వున్నది. దేనికి దగ్గరగా వున్నది? మన యింద్రియములకు దూరముగానున్న దానిని That అన్నారు. మన యింద్రియములకు సమీపముగానున్న దానిని This అన్నారు. ఇంద్రియములకు సమీపముగా వున్నది దేహమే. మరి యింద్రియములకు దూరముగానున్న తత్ అనేది ఆత్మ. దూరముగానున్న ఆత్మను దగ్గరగానున్న దేహముతో అసి కలపటమే మనస్సు యొక్క స్వభావము. దీనినే తత్ త్వం అసి అని పిలుస్తూ వచ్చారు. కనుక

523059103

మానవత్వములో ఈ శరీరము, మనస్సు, ఆత్మ ఈ మూడింటి యొక్క సమ్మిళిత
స్వరూపాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. తత్వమసి అనగా ప్రత్యేకమైన
అర్థమేమీ లేదు. అది ఇది చేరినటువంటిదే తత్వమసి. అనగా అతీతమైన
ఆత్మలో అనుభవ రూపమైన దేహముతో ఏకత్వమును అనుభవించి దివ్యత్వము
పొందటమే. తదుపరి జీవుడు, దేవుడు, ప్రకృతి ఈ మూడూ కూడను మరొక
కోణంగా నిర్ణయించుకుంటూ వచ్చారు. ఈ మూడింటి యొక్క సారాంశమును రక్తి,
భుక్తి, ముక్తి అని కూడను ఏర్పరచుకుంటూ వచ్చారు. రక్తి. ఏమిటది? ఈ
జగత్తే మనకు రక్తి.. భుక్తి ఈ దేహమునకు భుక్తి అత్యవసరము. ముక్తి స్వరూపుడే
ఆత్మ. కనుక ప్రతి మానవునకు రక్తి, భుక్తి, ముక్తి అత్యవసరమని తత్వమసి బోధిస్తూ
వచ్చింది. స్థూలము, సూక్ష్మము, కారణము. ఇంతేకాక జగత్తునకు ఘనమైన ప్రకృతి
తత్వాన్ని ఇందులో ఇముడ్చుకుంటూ వచ్చారు. భూత భవిష్యద్వర్తమానము
లయందు అంతర్వాహినిగా ప్రవహించేది తత్వమసి అని కూడను నిరూపించారు.
కనుక మానవత్వము లోపల ఈ తత్వమసి అనేదానిని ఎంత సులభముగా వారు
గుర్తించి ప్రజలకు చాటిస్తూ వచ్చారు. నది ప్రవహించింది. ప్రవహించిన నది
సముద్రములో చేరింది. సముద్రము యొక్క జలము ఆవిరిగా మారింది. ఆవిరి
మేఘములుగా రూపొందింది. మేఘము వర్షముగా కురిసింది. వర్షము తిరిగి
వంకలుగా ప్రవహించాయి. ఈ వంకలు ఒక నదిగా రూపొందాయి. ఈ రూపొందిన
నది తిరిగి సముద్రములో చేరిపోయింది. కాని ఈ నది ఎక్కడనుండి వచ్చింది?
ఈ నది నీరు ఎక్కడిది? అది నదికే మాత్రము తెలియదు. కానీ చేరిన తరువాత
తత్వమసి మేము ఇందునుంచే బయలుదేరినవారము. మేము ఇది రెండూ
ఒక్కటే యని ఆనాడు గుర్తించుకుంటూ వచ్చాయి. ఒక విత్తనము భూమిలో నాటి
నాము. అది మొక్క రూపము ధరించింది. మొక్క వృక్షముగా రూపొందింది. ఈ వృక్ష
ములో కొమ్మలు రెమ్మలు ఆకులు కాయలు ఫలములు కలిగినాయి. కానీ ఈ కొమ్మ
లు ఈ రెమ్మలు ఈ ఆకులు ఈ పువ్వులు ఈ కాయలు ఈ ఫలములు ఎక్కడ
నుండి వచ్చాయి? వటి యొక్క రూప నామములు, రుచి ప్రభావములు వేరు వేరు
అయినప్పటికి ఇవి అవి చేరి ఒక్కటే అనే సత్యాన్ని నిరూపించుకుంటూ వచ్చారు.
ప్రజలు. ఆ విత్తనములో వున్న అంశము చెప్పుతూ వున్నది తత్వమసి అని.
ఈ కొమ్మలు, ఈ రెమ్మలు, ఈ పువ్వులు, ఈ కాయలు, ఈ ఫలములు ఇవన్నీ కూడ
ను నానుంచి వచ్చినటువంటివే. ఈ విధమైన ఆధారమును పురస్కరించుకొని
జగత్తంతయు కూడను ఈశావాస్యమిదం జగత్ అని నిరూపిస్తూ వచ్చారు.

నీటిలో యింత చక్కెర వేశాము. దానిని చక్కగా కలిపేటప్పటికి ఆ చక్కెర అంతా నీటిలో సర్వత్ర వ్యాపించి పోయింది. కాని కంటికి కనుపించదు. చేతికి చిక్కదు. కానీ చక్కెర లేదా? వున్నది. అరూపమై వుంటున్నది. అగమ్యమై వుంటున్నది. కానీ అది కేవలము జిహ్వకు మాత్రము వుండినట్లుగా గుర్తించటానికి వీలవుతుంది. గుర్తించినప్పుడు యేమి చెబుతున్నది చక్కెర? తత్త్వమసి. ఆ మాధుర్యము మీద జలమునది కాదు ఆ మాధుర్యము. ఈ విధముగా భగవంతుడు సర్వవ్యాపియై వున్నాడనే సత్యాన్ని ఆనాటి మహర్షులు యిలాంటి చిన్న చిన్న వాక్యముల చేత ప్రబోధలు ప్రచారము సలిపి యీ తత్త్వమసి అనే ఏకత్వమును ప్రబోధిస్తూ వచ్చారు.

ఇంతేకాక మానవుడు తనయొక్క తత్త్వాన్ని, తనయొక్క జీవితమును, పరిసర ప్రాంతములను గుర్తించుకొనుటకు తగిన ప్రయత్నం చేయుట లేదు. ఉన్నది ఒక్కటే అనేకత్వముగా రూపొందుతూ వస్తుంది. అనేకత్వములో వున్న ఏకత్వమే భారతీయ సంస్కృతి యొక్క ప్రభావమని కూడను ఉపనిషత్తులు చాటుతూ వచ్చాయి. ఏకత్వాన్ని విస్మరించి అనేకత్వమును విశ్వసించి మన జీవితమును వ్యర్థము చేసుకుంటున్నాము.

ఇక్కడ అకార ఉకార మకారముల యీ మూడింటి యొక్క ఏకస్వరూపమే ఓంకారము. ఈ ఓంకారము యొక్క శబ్ద ప్రమాణమే ప్రణవము. ఈ ప్రణవమే ప్రపంచ స్వరూపము. కనుక ఓంకార మహాస్వరూపమే యీ జగత్తు. ఈ రెండు కూడను దివి నుండి భువి వరకు, భువి నుండి దివి వరకు ప్రసారము జరుగుతూనే వుంటున్నది. ఈ రెండింటి ఏకత్వము లోపల వున్న ఆత్మ తత్త్వాన్ని గుర్తించటమే నిజమైన పురుషత్వమని బోధిస్తూ వచ్చింది ఉపనిషత్తు. కారణం? ప్రతి మానవునియందు యీ ప్రణవ శబ్దమనేది నిశ్శబ్ద రూపములో నిండి వుంటున్నది. ప్రణవము మనకెక్కడా కనుపించటం లేదే, వినిపించటం లేదే అని మనము విచారించవచ్చు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఏమిటి? మన దేహమునందు సంచరించే రక్తము యొక్క సంచారము ఏమిటి? ఇవన్నీ ప్రణవమయమైనటువంటివే. చెట్లుగాలి వీస్తుంది. ఆ గాలి యందు కూడను ప్రణవ నాదము వినబడుతున్నది. ఒక electric pole పోయి నీవు నిల్చుకొని ఆ electric pole పైన చెవి పెట్టినప్పుడు ఓమ్ అని ఆగకుండా మనము వినగలుగుతున్నాము. ఇతే యీ ప్రణవము నందు కేవలము కొన్ని కల్పితమైన వాటిని మనము కల్పించుకోటం చేత అది ప్రణవముగా రూపొందటం మనం గుర్తించటం లేదు. మన నిత్య జీవితములో ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుతున్నవి. మనము గాలిని

523059105

పీల్చుకొను సమయములో లోపల సో... అని పీల్చుకుంటున్నాము. విడుచునప్పుడు హా......మ్. సో....హా....మ్. సో...హా...మ్. ఈ రెండింటి ఏకత్వము లోపల నిజమైన ఓంకారము వుంటున్నది. సో అనే పదము లోపల, హమ్ అనే పదము లోపల వుండిన అంతరార్థమును మనము గుర్తించుకుంటే సోహం అదేనేను అది కూడను తత్త్వమసి. తత్ త్వం అసి మూడక్షరాలలో నిండినటువంటిది. ఏకాక్షరమనే చెబుతున్నాం. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ. ఒకే అక్షరమని అంటున్నాము ఇది యే విధంగా ఒక అక్షరమవుతుంది? సో... యిందులో సారూప్య, సామీప్య సాయుజ్యములను సంబంధించినటువంటి స కారము మైనస్ అవుతుంది. ఎప్పుడు యీ సకారము మైనస్ అవుతుంది. జగత్తును మరచి నిద్రావస్థలో నిల్చినప్పుడు. జగత్తు యొక్క మంచి చెడ్డలను మనము విస్మరించినప్పుడు. ఈ సో అనే శబ్దము లోపల సకారము మైనస్ అయిపోయి కేవలము ఓ అవుతుంది. హమ్ అనే నిశ్వాసము లోపల హకారము మైనస్ అవుతుంది. జాగ్రత్తలో వుండినంత వరకే సకార హకారములు యీ ఓంకారముతో లీనమవుతూ వుంటాయి. ఈ జాగ్రత్తను విస్మరించి గాఢనిద్రలో వుండినప్పుడు యీ సకార హకారములు రెండూ కూడను అంతర్థానమవుతాయి. సో అనే పదములో సకారము పోయినప్పుడు ఏమవుతుంది? ఓ అవుతుంది. హమ్ అనే నిశ్వాసము లోపల హకారము పోయినప్పుడు మ్ అవుతుంది. ఓ+మ్ ఓమ్ అయిపోయింది. సకారము, హకారము రెండూ చేరినప్పుడు సోహం అయిపోయింది. ఈ సకారము, హకారము రెండూ పోయినప్పుడు ఓమ్ అయిపోయింది. అనగా జాగ్రదవస్థలో వుండినంత వరకు మానవుడు యీ ప్రాకృతమైన జీవితములో లీనమైపోయి తద్వారా ఏకాక్షరం బ్రహ్మ అనే సత్యాన్ని మరచిపోతున్నాడు. ఈ ప్రపంచము మన దృష్టిలో వుండినంత వరకే మన సుఖదుఃఖములు ఆనందములు. ఏనాడు నిద్రావస్థలో మనము ప్రవేశిస్తామో అప్పుడు యీ జాగ్రత్ ప్రపంచము మనకు మరుగై పోతుంది. జాగ్రత్ ప్రపంచము మరుగైనప్పుడు మన సుఖదుఃఖములు మరుగైపోతాయి. దీనిని పురస్కరించుకొనియే నిద్ర సమాధి స్థితి అన్నారు. ఆ నిద్రావస్థయందు యేవిధమైన సుఖముగాని, దుఃఖముగాని ప్రాకృతమైన జగత్తుగాని మనకు కానరాక అనుభవమునకు రాక నిల్చిపోయి వుంటాయి.

కనుక మానవుడు దైవత్వాన్ని గుర్తించటానికి యీ రకమైన మార్గాన్ని అనుసరించాలి. ఉపనిషత్తులు యివి పెద్ద పెద్ద పదములుగా వుండిన దానిని చిన్నచిన్న వాక్యములుగా క్రోడీకరించుకొని సామాన్యమైన మానవులకు నిత్యజీవిత

523059106

ములో అనుభూతికి, ఆనందమునకు, అనుగుణంగా రూపొందుతూ వచ్చాయి. ఉప-ని-షద్. ఉప అనగా సమీపము. ని అనగా క్రింద. షత్ అనగా కూర్చో. అనగా గురువునకు పెద్దలకు వినయంగా నీవు అనుసరించాలి అని దీని అర్థము. నీకు భగవంతుడు ఎంత దూరమో అనుకుంటున్నావో అంత దూరంగా వుంటాడు. భగవంతుడు ఎంత సమీపుడని భావిస్తున్నావో అంత సమీపుడుగా వుంటున్నాడు. ఈ దూరమునకు సమీపమునకు నీ భావము లేగాని దోషము భగవంతుడు దూరముగాని దగ్గరగాని సర్వత్రా వుంటున్నాడు. అణువులో అణువుగా ఘనములో ఘనముగా వుంటున్నారు. కనుకనే అణోరణీయాన్ మహతో మహీయాన్. ఇలాంటి దివ్యమైన తత్వాన్ని ప్రతి మానవుడు కూడను పరిశోధనలు చేసి విచారణ సలిపి శ్రద్ధా భక్తితో దీనిని విచారణ చేయాలనుకున్నప్పుడు తప్పక దీనిని అర్థము చేసుకుంటావు. కానీ యీనాటి మానవుడు తెలుసుకొనుటకు లేశమాత్రము ప్రయత్నించటం లేదు. ఈ అనిత్యము అశాశ్వతము అసత్యమైన జగద్వ్యాపారములయందు తమ సమస్తమంటు అంకితముగా చేస్తున్నారు. కానీ నిత్యసత్యమైన దివ్యమైన మార్గమునందు తన కాలమును అణుమాత్రమైనా అంకితము చేయుటం లేదు. ఇదే మానవుని యందు ఏర్పడిన అశ్రద్ధ. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. శ్రద్ధ కలిగిన వానికే జ్ఞానము లభ్యమవుతుంది. శ్రద్ధ లేనప్పుడు ఏమాత్రము సమీపములో వుండిన దానిని కూడను మనము అనుభవించలేము.

మానవుడు తన అశాంతికి మూలకారణము ఏమిటో గుర్తించటానికి తగిన ప్రయత్నం చేయుటం లేదు. బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు సర్వకళా పరిపూర్ణుడైనప్పటికినీ, సర్వశాస్త్ర ప్రవీణుడైనప్పటికినీ అప్పుడప్పుడు తనిలో అశాంతి పెల్లుబుకుతూ వచ్చింది. ఈ అశాంతికి కారణమేమిటో గుర్తించాలని సనత్కుమారుని దగ్గరకు వెళ్లాడు. 'సనత్కుమారా! నా అశాంతికి కారణమేమిటో బోధించి దానిని నిర్మూలము గావించి తగిన జ్ఞానమును ప్రసాదించమని ప్రార్థించాడు. అప్పుడు సనత్కుమారుడు నారదుని ప్రశ్నిస్తాడు. నారదా! నీ qualificationగా ఏమిటి? నీవు ఏమి చదివావు? నీకు ఏమి అర్హత వుంటుండది?' అని ప్రశ్నించాడు.

అరువది నాలుగు విద్యలు
ఘనమారగ నేర్చినట్టి యా నారదుడే
నిరవధిక శాంతి కనుగాని

పరమానందమును తాను పొందగలేడె!

అరువది నాలుగు విద్యలు నేర్చినవాడు నారదుడు. ఏదో ఒకటి రెండు సబ్జెక్టులు కాదవి. అరువది నాలుగు సబ్జెక్టులు. అంతే కాక ఆరు శాస్త్రములు నాలుగు వేదములు, ఇరవై నాలుగు ఉపాంగములు కూడను చదివాడు. ఇన్ని విద్యలు నేర్చి ఏమి ప్రయోజనము

ఎన్ని విద్యలు నేర్చియు ఏమి ఫలము
తన్ను సటువిల తప్పించ నెవరి తరము
చెడ్డ బుద్ధులు తన తల చేరె నేని
రెండు బారును బుద్ధులు బండబారు.

నారదునికి అశాంతి రావటానికి కారణం ఏమిటి? నేను విద్వాంసుడను నేను సర్వశాస్త్ర ప్రవీణుడను అనే అహంకారమే దీనినంతా మరుగు పరుస్తూ వచ్చింది. ఈ అశాంతికి మూలకారణము అహంకారమే. అన్నీ విన్న సనత్కుమారుడు ఓహో! నీ విద్యల యొక్క ప్రభావము యింతేనా యని పెదవి విరిచాడు.. ఇది కేవలము పేర్లు మాత్రమే. ఈ డిగ్రీలంతా పేర్లు మాత్రమే. కేవలము నామ మాత్రమే. ఈ నామమునకు అతీతమైనవి కొన్ని వున్నాయి. నారదా! నారదుడు చాలా ఆశ్చర్య పడ్డాడు. ఈ అరువది నాలుగు విద్యలు నేర్చిన వాని కేవలం నామమాత్రం అంటున్నాడే యింత సులభంగా త్రోసివేస్తున్నాడే అని ఆశ్చర్య పడ్డాడు. ఈ నామము కంటె గొప్పది మరొకటి వున్నది నారదా అన్నాడు. నామము కంటె గొప్పది వాక్కు వాక్కు కంటె గొప్పది మనస్సు. మనస్సు కంటె గొప్పది సంకల్పము. సంకల్పము కంటె గొప్పది చిత్తము. చిత్తము కంటె గొప్పది ధ్యానము. ధ్యానము కంటె గొప్పది జ్ఞానము. జ్ఞానము కంటె గొప్పది నీరు. నీరు కంటె గొప్పది తేజస్సు. తేజస్సు కంటె గొప్పది ప్రాణము. ఈ ప్రాణతత్వమును అర్థము చేసుకున్నప్పుడే నీకు తత్త్వమసి అర్థమవుతుంది. అన్నాడు. కనుక ప్రాణతత్వమును మనం మొట్టమొదట అర్థం చేసుకోవాలి.

ఒక చిన్న ఉదాహరణము.. పక్షము దినములు మనము ఆహారము తీసుకొనక పోతే పదహైదు కళలు మనకు క్షీణించి పోతాయి. క్రమక్రమేణా మనము ఆహారము అధికము చేసుకున్నప్పుడు యీ పదహారు కళలు మనలో ప్రవేశిస్తాయి. అనగా దీని యొక్క అంతరార్థము ఏమిటి? శరీరము అన్నమయము. అన్నమయమైన యీ శరీరమునందు అన్నము క్షీణించేటప్పటికి ప్రాణశక్తి కూడను క్షీణిస్తూ వస్తుంది. కనుక శరీరము

523059108

క్షీణించేది: క్షీణించని ఆత్మ యీ క్షీణించే శరీరమునందు వుంటున్నది.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల మంద్రలు లేవు నిజంబు చూడయా
దేహియె దేవదేవుడు....

కనుక యీ క్షీణించే శరీరమునందు క్షీణించని ఆత్మ నిరంతరము ప్రకాశిస్తూ వుంటుంది. అట్టి నిత్యసత్యమైన ప్రాణ తత్త్వాన్ని అర్థము చేసుకోటానికి ప్రయత్నించమన్నాడు. అదే ఆరుణి తన కుమారుడైన శ్వేతకేతునకు ఏది నిత్యమో ఏది సత్యమో ఏది తెలుసుకుంటే సర్వము తెలుసుకున్నవాడౌతాడో దానిని చూచినప్పుడు సర్వము చూచిన వాడవౌతావో దానిని గుర్తించు నాయనా అని ప్రబోధించాడు.

కనుక మానవుడు గుర్తించవలసినది ఒక్కటే. ఒకటౌనిని మనము గుర్తించుకుంటే అన్ని అందులో లీనమైపోతాయి. ఆ ఒక్కటి ఏమిటి? అదే ఆత్మతత్త్వము. ఈనాడు ఆత్మవిశ్వాసము కోల్పోతున్నాము. ఆత్మగాని అనాత్మ భావములన్నియు మనము తెలుసుకుంటున్నాము. మనము చేయవలసిన సాధనలు ఏమిటిప్పుడు? ధ్యానమా? యోగమా? తపమా? జపమా? యజ్ఞమా? యాగమా? క్రతువులా? ఇవి యేమియు కాదు. ఒక్కటి మాత్రమే మనము గుర్తించాలి. అనాత్మ భావమును వదలిపెడితే ఆత్మసాక్షాత్కారమవుతుంది. ఏ సాధనలు చేయనక్కరలేదు. ఈ సాధనలు కేవలము అల్పమైన మనస్తృప్తి కోసం చేసేటువంటివి. ఈ చేసే సాధనలన్ని మనస్సు ద్వారానే చేస్తున్నాము. మనస్సు ద్వారా చేసే సాధనలు మనస్సును యే విధంగా అరికట్టగలదు? దొంగను దొంగ పట్టగలడా? తానే దొంగయైనప్పుడు తనను తాను పట్టటానికి యే మాత్రము ప్రయత్నించడు. అదేవిధముగనే మనస్సు మనస్సు పట్టటానికి యే మాత్రము ప్రయత్నించదు. మనస్సును మనము అమనస్కము చేసుకోవాలి. అమనస్కమనగా ఏమిటి? సంకల్పరహితమే అమనస్కము. సంకల్పములు క్రమక్రమేణా మనము తగ్గించుకుంటే తప్పక మనస్సు యొక్క ప్రభావము తగ్గిపోతుంది. కాన మానవుడు ఆత్మవిశ్వాసము అభివృద్ధి గావించుకోవాలనుకున్నప్పుడు యీ దేహమనో బుద్ధుల ప్రభావములన్నింటిని కూడను యీ ఆత్మయందే లయము చేసుకుంటూ రావాలి. ఏ సంకల్పము వచ్చినప్పటికి వాటిని అన్నింటిని ఆత్మలో ప్రవేశపెట్టాలి. ఇదే సరియైన

సాయుజ్యము. సాయుజ్యమనే తత్వములో ఏకత్వమే మనకు లభ్యమవుతుంది. కాని భిన్నత్వము శూన్యమవుతుంది. గోదావరి, కృష్ణ, యమున, కావేరి ఇవన్ని ప్రవహిస్తూ వుంటాయి. కాని ప్రవాహముల యొక్క రూపములు వేరువేరుగా కనుపిస్తాయి. వాని యొక్క రుచులు కూడను వేరువేరుగా రూపొందుతాయి. కన్నియు సముద్రములో చేరిన తరువాత యీ సర్వనదులు తమ రూప నామ రుచులను కోల్పోయి సముద్రము యొక్క రూపనామ రుచులనే పొందుతాయి. అదియే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. అందులో చేరినప్పుడు తాను కూడను ఆరూపాన్ని ధరిస్తాడు. ఆత్మయందు సమస్త సంకల్పములు చేరినప్పుడు ఆత్మగానే రూపొందుతాము. కనుక ఆత్మకానిది యీ జగత్తులో లేదు. సర్వము దైవమైనప్పటికి మనము దైవ దృష్టితో చూడటం లేదు. లోకదృష్టితో చూస్తున్నాము. ప్రాకృత దృష్టితో చూచినంత కాలము ఆత్మతత్వము మనకు అర్థముకాదు. ఒక చిన్న ఉదాహరణము. దీనిని టంబ్లరు రూపములో చూచినంత వరకు యిది టంబ్లరుగానే కనుపిస్తుంది. ఈ టంబ్లరు దేనితో చేయబడి వుంటున్నది. వెండిలో చేయబడింది. వెండి దృష్టి చూచినప్పుడు టంబ్లరు మనకు గుర్తురాదు. మరొకటి. తిరుపతికి వెళ్లాము లేక యింకొక క్షేత్రానికి వెళ్లాము. ఒక స్వరూపము మనకు కనుపిస్తుంది. స్వరూపము నందు దృష్టి వుంచినంత వరకు కూడను ఆ స్వరూపము ఏ పదార్థములో చేయబడింది అనేది మనకు ఏమాత్రము తెలియదు. దృశ్యము పైననే మనము యిది పెట్టినప్పుడు కేవలము రూపము మాత్రమే కనుపిస్తుంది. కాని ఆ రూపము దేనిచే చేయబడినది అని ఆధారభూతము పైన దృష్టి వుంచినప్పుడు రాయి కనుపిస్తుందిగాని స్వరూపము కనుపించదు. కనుక యీనాడు రూపనామముల తో కూడిన జగత్తుపై దృష్టిని ప్రసరింప చేస్తున్నాము. కనుకనే మిద్దెలు, గోడలు, చెట్లు, వనములు, నదులు అన్నీ కనుపిస్తున్నాయి. కాని అన్నింటి యొక్క ఆధారభూతమైన తత్వాన్ని గుర్తించుకున్నప్పుడు యివన్నీ కూడను ఏకత్వముగా రూపొందుతాయి. వృక్షములంతా కాష్ఠమయము. పర్వతములంతా రాతిమయము. భూమి అంతా మృణ్మయము. దేహమంతా కేవలము రక్తమయము ఇవన్ని పంచ భూతముల యొక్క స్వరూపమే. ఈ పంచభూతములు ఎక్కడ చేరుకుంటున్నాయి. ఆత్మయందున్న అంశములే. కనుక ఆత్మ భావమును మనము చక్కగా అర్థము చేసుకుంటే యివన్ని సులభముగా మనకు అర్థమవుతాయి. ఈ.

ఎన్ని రకములైన ఆభరణములైనప్పటికిని, అన్నింటియందు

523059110

ఆధార భూతమైనది బంగారు ఒక్కటే యని తెలుస్తుంది. దీనినే ఆనాటి సాధకులం
దరూ కూడను, మహర్షులందరు కూడను ఏకత్వాన్ని ప్రబోధిస్తూ వచ్చారు.

శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒకటే
జీవ జంతులు వేరు జీవుండు ఒక్కడే
జాతి నీతులు వేరు జన్మమొక్కటె
దర్శనంబులు వేరు దైవంబు ఒక్కటే
పూల జాతులు వేరు పూజలొక్కటె
తెలియలేకను మానవుల్ తెలివి దప్పి
బ్రతుకు కోసము బహు బాధ బడ్డులైరి.

ఈ జీవనోపాధి నిమిత్తమై యిన్ని రకములైన భావములు మనము పెరుచుకొని మన
జీవితమును చించుకుంటున్నాము. యింకా ఒక చిన్న ఉదాహరణము. జాగ్రదవ
స్థయందు మనము యెన్నియో దృశ్యములంటా చూస్తున్నాము. ఎన్నియో అవ
స్థలను అనుభవిస్తాము. కాని నిద్రావస్థలోనికి పోయినప్పుడు సర్వము సమస్త
పదార్థములు కూడను మనకు మనమే సృష్టించుకుంటాం. తనను తానే సృష్టిం
చుకుంటాడు. కష్టసుఖములు కూడను తానే సృష్టించుకుంటాడు. జగత్తు
నంతా తానే సృష్టించుకుంటాడు. అందులో తాను బంధితుడౌతాడు. కానీ
పరిపూర్ణ సుషుప్తి అవస్థలో పోయినప్పటికి అన్నింటిని మరచిపోయి నిశ్శబ్దంగా
తాను ఒక విధమైన సమాధిస్థితిని పొందుతాడు. జాగ్రత్తలో అనుభవించిన
వాడూ తానే. స్వప్నావస్థలోపల సృష్టించుకున్న వాడూ తానే. సుషుప్తి అవస్థ
లోపల ఏకత్వమును పొందిన వాడూ తానే. అవస్థలు మూడూ గాని వ్యక్తి
ఒక్కడే. ఇదే తత్త్వమసి. అనగా యీ మూడు కాలములందు కూడను
మూడు అవస్థలయందు కూడను, మూడు స్థితిగతులయందు కూడను
అనుభవించిన వ్యక్తి ఒక్కడే. అదే విధముగనే మానవత్వమనేది యీ దేహ
ధారిగా వుండినంత వరకు ఇది మానవత్వమని అర్థమవుతుంది.

మానవత్వాన్ని మనము గుర్తించుకున్నామే గాని మానవతా గుణ
ములు మనము గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. మనము మొట్ట
మొదట యీనాడు సాధించవలసినది, అర్థము చేసుకోవలసినది మాన
వతాగుణములు. ఎన్ని పదవులు ఏలినా, ఎన్ని విద్యలు అభ్యసించినా, ఎన్ని
విధములైన ఘనత చెందినా మనము వుండవలసినది, సాధించవలసి

నది మానవత్వము. ఈ మానవత్వము అభివృద్ధి కావాలంటే ఒక ఆధ్యాత్మిక వాతా
వరణమునందే అభివృద్ధి అవుతుంది. ఒక విత్తనము తెచ్చి ట్రేసళ్ళలో
పెట్టి నీరు పోస్తే ఆ విత్తనము కుళ్ళిపోతుంది. కాని ఆ విత్తనమునే నేలలో
నాటినప్పుడు అది వృక్షముగా రూపొందుతుంది. మానవత్వమనేది లౌకిక
మైన దానియందు వుంచినప్పుడు అది అభివృద్ధి కాదు. ఈ లౌకిక భౌతిక
ములందు యీ మానవత్వము యేమాత్రము అభివృద్ధి కాదు. ధార్మిక, నైతిక
ఆధ్యాత్మికమునందే యీ మానవత్వము అభివృద్ధి గాంచుతుంది. కనుక యీ
నాడు అభివృద్ధిగావించుకోవలసింది మానవత్వము. ప్రతి మానవుడు కూడ
ను మానవత్వాన్ని పొందాలి. మానవత్వాన్ని అర్థం చేసుకోవాలి. కేవలము శారీరక
సంబంధమైన బంధములను, బంధుత్వమును మాత్రమే అభివృద్ధిగావించు
కోటం సరికాదు. ఇది కేవలము శారీరక సంబంధమైన బంధుత్వమే. పుట్టక
పూర్వము ఎవరు తల్లి ఎవరు బిడ్డ. పెండ్లి కాక పూర్వము ఎవరు భార్య ఎవరు
భర్త. ఇవన్నీ మధ్యలో చేరినవి మాత్రమే. ఇవన్నీ passing clouds. ఇలాం
టి నిమిత్తమై వెరువ కూడదు. దుఃఖమునకు అవకాశము నందించకూడదు.
ఇవన్నీ సంయోగ వియోగములతో సంభవించేటువంటివి. జీవితమంతా
కూడను సంయోగ వియోగ సంఘర్షాత్మక మహోత్తాల తరంగమైన సాగరము.
మనము ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. నిత్యము మనము ఎన్నో ఆశిస్తున్నాము.
నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయముంచే, అంతులేని ఆశలచే, అర్థము
కాని ఆవేదనలచే అస్థాప్య రూపమైన ప్రాప్తి కోసము ఆశలు పడి అంతులేని
దుఃఖములకు గురైపోతున్నాము. కనుక యీ అశాంతికి గురైన మానవులకు
చక్కని మార్గము చూపె దీపికలే ఆధ్యాత్మిక జ్యోతులని విశ్వసించాలి.

ఆధ్యాత్మికమనేది నశిస్తే భారతదేశము నశిస్తుంది. కనుక ఆధ్యా
త్మికమనేది నశించకుండా మనము చూచుకోవాలి. భారతదేశము ఆధ్యాత్మికము
పైనే ఆధారపడి వుంటుంది. ప్రోసారు. Indian culture and spirituality
culture, spirituality రెండూ కానే కాదు నా దృక్పథములో. spirituality
ఒకటి వుంటే culture అందులోనే లీనమైపోతుంది. ఈ రెండూ వేరు చే
యకూడదు. spirituality వుండినప్పుడు సమస్త సంబంధమైన ధర్మ
ములు అందులోనే లీనమైపోతాయి. అది లేక కేవలము culture culture
అంటే ఏమి culture అది. meaningless culture. Culture అంటే
సంస్కృతి. సంస్కృతి అనగా సంస్కరింపబడినది అని అర్థము. ఏవిధంగా

సంస్కరింపబడింది. Spirituality తో సంస్కరింపబడింది. Spirituality
నే లేక పోతే దానికి సంస్కారమే లేదు. సంస్కారము లేక సంస్కృతియు లేదు. కను
క మొట్టమొదట సంస్కారము కావాలి. సర్వసంస్కార స్వరూపమైనదే Spirituality
అదే ఆధ్యాత్మికము. అట్టి ఆధ్యాత్మికమనేది మానవుని యందు యీనాడు పూర్తి
క్షీణించి పోయింది. ఆధ్యాత్మికమంటే హాస్యాస్పదమై పోతున్నది. ఔను మరి!
ఆధ్యాత్మికము హాస్యాస్పదమే. ఎవరికి హాస్యాస్పదము. కేవలము భౌతికమైన
లౌకికమైన జీవితములే సత్యము నిత్యమని భావించిన మూర్ఖునికి యిది హాస్యా
స్పదము. యిది భౌతికము, లౌకికము, అనిత్యము passing clouds అనే సత్య
మును విశ్వసించిన వానికి ఆధ్యాత్మికము గొప్ప శోభయైన మణి వంటిది. అది
అతనికి ఆభరణము. ఇట్టి ఆభరణమును ధరించాలి యీనాటి మానవుడు.
అప్పుడే దివ్యమైన మానవత్వము రూపొందుతుంది.

విద్యార్థులారా. మన భారతీయ సంస్కృతి యిట్టిది అట్టిది
అని వర్ణించుటకు వీలుకాదు. ఇది అన్ని జాతులవారు, అన్నిదేశీయులు అన్ని
వర్ణముల వారు కూడను దీనిని యెంతో వర్ణించుకుంటూ వచ్చారు. ఇందుకు
ముస్లిం మతమునకు సంబంధించిన బాబరు. అతనికి భారతీయ సంస్కృతి
పైన గొప్ప విశ్వాసము. అతను తనకు కుమారుడైన హుమయూన్ భారతదేశము
నకు మొట్టమొదటి రాజుగా వచ్చాడు. దానికి బాబరు చాలా ఆనందించాడు.
ఆనందించి హుమాయూన్‌కు పెద్ద letter వ్రాసాడు. హుమయున్. నీవు ఎంత
అదృష్టవంతుడవో! యిలాంటి అదృష్టవంతుడైన పుత్రుడు నా గర్భమునం
దు పుట్టటం నేనెంత అదృష్టవంతుడనో. పవిత్రమైన భారతదేశమునకు
సమస్త మతములను సమన్వయము గావించే భారతదేశానికి అనేకత్వములోని
ఏకత్వమును నిరూపించే భారతదేశమునకు సర్వమత సారమైన భారతీయ మత
ముయొక్క సారమునకు నీవు చక్రవర్తి కావటము. ఎంత అదృష్టవంతుడవోయి.
అయితే యీ అదృష్టము నీవు నిలబెట్టుకో. భారతీయ సంస్కృతికి నీవు యేమాత్ర
ము అడ్డు తగలవద్దు. అది మహాశక్తివంతమైనది. అది సాధించలేనిది
జగత్తులో మరొకటి లేదు. అట్టి భారతీయ సాంప్రదాయమునకు నీవు
యేమాత్రము అడ్డుతగలక యే ఒక్క నిర్ణయానికి నీవు రావలసివచ్చిన
ప్పటికిని భారతీయులను సంప్రదించి దానికి తగిన సలహాను నీవు పొంద
మని వ్రాస్తూ వచ్చాడు బాబరు. అతను మొగలు సామ్రాజ్యమును స్థాపించిన
మహావీరుడు. అలాంటి బాబరే భారతీయ సంస్కృతిని యింత గొప్పగా

వర్ణిస్తూ వచ్చాడు. కాని దురదృష్ట వశాత్తూ ఈనాటి భారతీయులే భారతీయ సంస్కృతిని పూర్తి ముక్కలు కోస్తున్నారు. ఇది ఎంత అవమానకరమైన విషయము. కనుక భారతీయులైన మీరు భారతీయ సంస్కృతిని చక్కగా మీరు అర్థము చేసుకొని, దానిని కాపాడుకొని అనుసరించి ఆ ఆనందమును అనుభవించాలని నేను ఆశిస్తున్నాను.

ఇది గొప్పది అది చిన్నది అని నేను ఎప్పుడూ భేదాలు చెప్పను అన్ని మతములు గొప్పవే. అన్ని మతముల లోని రహస్యము చాలా గొప్పది. కాని మతముల పేరు లోపల ఈ సంస్కృతిని ఎవ్వరూ అనుసరించటం లేదు అదే మానవుని యందు ఏర్పడిన దోషము. కనుక మతము యొక్క తత్వాన్ని చక్కగా అర్థము చేసుకొని దాని అనుసరించి దానిని తిరిగి ఆనందముగా అనుభవించటానికి ప్రయత్నించాలి. ప్రతి మానవుడు గమ్యము చేరటానికి అర్హుడే. తన యొక్క నిజ తత్వాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించే ప్రతి ఒక్క వ్యక్తికి అధికారము వుంటున్నది. ఇది వారికి వీరికి అనే భేదము లేదు. కుల మతములతో యే మాత్రము సంబంధము లేదు. కనుక మీరు మానవత్వమును మానవత్వముగా విశ్వసించి మానవత్వమును దివ్యత్వముగా మార్చుకోటానికి ప్రయత్నించండి. దానవత్వంగా మాత్రం మార్చుకోకూడదు. సమస్త వుపనిషత్తులు ఈ పవిత్రమైన ఏకత్వాన్ని ప్రబోధిస్తున్నాయి. ప్రతి మానవుడు ఈనాడు భోగమును మాత్రమే అనుసరిస్తున్నాడు, ఆశిస్తున్నాడు గాని త్యాగమును మాత్రము అనుసరించటం లేదు ఆశించటం లేదు. త్యాగము అత్యవసరము. ఇదియే వేదము చెప్పినది. న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః. ఈ త్యాగము నకు, ఈ భోగమునకు వుండిన సంబంధ బాంధవ్యమును మనము రేపటిదినము ముచ్చటించుకుందాము.